

ప్రసంగిస్తున్న కందికుంట వెంకటప్రసాద్
ప్రసంగిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

టీడీపీతోనే సామాజిక న్యాయం

- ఒక్క చాన్స్ పేరిట జగన్ మోసగించాడు
- ముస్లింల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పిస్తాం
- బీసీల కోటాకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- బీకే పార్థసారథి, కందికుంటను గెలిపించండి
- పురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర' ప్రారంభం

కదిరి, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర' పేరిట ఆయన కదిరిలో శనివారం ఎన్నికల ప్రచార శంఖరావాన్ని పూరించారు. ఎస్‌టీఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకున్న ఆయనకు కదిరి కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బాలకృష్ణ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలంఖాన్‌వలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీవీఆర్ గ్రాండ్ నుంచి జీవిమాను సర్కిల్‌వరకు సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. జై బాలయ్య, జై టీడీపీ నినాదాలతో కదిరి మారుమోగింది. జీవిమాను సర్కిల్‌లో అశేష జనవాహిని ఉద్దేశించి బాలయ్య ప్రసంగించారు. ఉర్దూలో మాట్లాడుతూ మైనార్టీల ఆకట్టుకున్నారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రను లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రమైన కదిరిలో ప్రారంభించడం తన అదృష్టమని అన్నారు. తన ఇష్ట దైవం లక్ష్మీనరసింహస్వామి చెంత పూజలు చేసి, మైనార్టీలకు ముఖ్యమైన దర్గాను సందర్శించి యాత్రను ప్రారంభించానని అన్నారు. సామాజిక న్యాయం కోసం సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

సెంటిమెంట్‌తో మోసగించాడు..

కోడి కత్తి డ్రామాలు, బాబాయి హత్య సెంటిమెంట్ పేరిట ఒక్క చాన్స్ అంటూ జగన్ మోసగించాడని, దాని ఫలితం అనుభవిస్తున్నామని అన్నారు. ఒకప్పుడు రాష్ట్రం పేరు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిందని, ఇప్పుడు ఎక్కడా కనిపించకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు కారణ జన్ముడు ఎన్టీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. నేటికీ ఆ పథకాలకు పేర్లు మార్చారే తప్ప, తొలగించలేదని అన్నారు. ఆ తరువాత టీడీపీ అధినేత చంద్రబాబు 14 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ఏమీ పీకలేదని విమర్శించారు. రాజధాని నిర్మించకుండా కాలక్షేపం చేశారని అన్నారు. రాష్ట్రాన్ని రుణాంధ్రగా మార్చేశారని, దళితులను హత్య చేయించారని ఆరోపించారు. అరాచకాలతో విర్రవీగుతున్న అహంకారిని ఓటుతో మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్లకు ఎటువంటి డోకాలేదని, బీసీల కోటాకు ఏ ప్రమాదమూ జరగనివ్వబోమని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రంజాన్ తోఫా, హజ్‌యాత్ర, దుల్హాన్, విదేశీ విద్య తదితర పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదే అని అన్నారు. ఓటును తాకట్టు పెట్టవద్దని, ఈ సైకో ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ఉపయోగించాలని అన్నారు. తల్లిని, చెల్లిని జగన్ వెళ్లగొట్టారని, బాబాయిని హత్య చేసినవారిని కాపాడుతున్నారని అన్నారు. అభివృద్ధి సంక్షేమం కావాలంటే టీడీపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎంతో అనుభవజ్ఞులైన హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథికి, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి వారిని గెలిపించాలని కోరారు.


అదిగో బాలయ్య..


కదిరిలో బాలయ్య అభివాదం..

కదిరి అభివృద్ధికి కట్టుబడ్డాం..

మదనపల్లి-రాయచోటి-పులివెందలను కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మిస్తామని బాలకృష్ణ హామీ ఇచ్చారు. గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాలకు హంద్రీనీవా నీటిని తీసుకొస్తామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉర్దూ పాఠశాల, కళాశాలలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని అన్నారు. కదిరి పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్ ద్వారా పట్టణానికి తాగునీటిని అందిస్తామని అన్నారు. ఫ్యాన్ వద్దు.. విసనకర్రే ముద్దు అంటూ.. అభిమానులకు ఆయన విసనకర్రలు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, ఇన్‌చార్జిలు భైవరప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకురాలు పర్వీన్ బాను, ఎన్‌టీకే ఫ్యాన్స్ జిల్లా నాయకులు జగన్, గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ మహిళా కార్యకర్తల కోలాహలం..

అభివృద్ధా..? అరాచకమా..?

- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- ఓపీఎస్ పేరిట ఉద్యోగులకు మోసం
- తాగునీటిని తోటకు మళ్లించిన ఘనుడు దుద్దుకుంట
- సైకిల్‌కు ఓటేసి పల్లె సింధూరను గెలిపించండి
- కొత్తచెరువు బహిరంగ సభలో నందమూరి బాలకృష్ణ


కొత్తచెరువు సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

కొత్తచెరువు, పుట్టపర్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని పురం ఎమ్మెల్యే, టీడీపీ స్టార్ క్యాంపెయినర్ నందమూరి బాలకృష్ణ అన్నారు. అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిన అరాచక జగన్ ప్రభుత్వం కావాలా..? రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం బాటలో నడిపిన చంద్రబాబు ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. కదిరి నుంచి ఆయన శనివారం రాత్రి 9 గంటలకు కొత్తచెరువు మండల కేంద్రానికి చేరుకుని, బహిరంగ సభలో ప్రసగించారు. తల్లిని, చెల్లిని బయటకు గెంటేసి, తండ్రి సమానులైన బాబాయ్‌ను రాజకీయం కోసం అతికిరతకంగా చంపించింది నీవుకాదా అంటూ జగన్‌పై మండిపడ్డారు. పులకేసి తరహాలో జనగ్ పాలించారని ఎద్దేవా చేశారు. విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రాష్ట్రంలోని ప్రకృతి సంపదను జగన్ దోచిపెట్టారని అన్నారు. పేదలు ఇళ్లు కట్టుకునేందుకు వీలుగాని స్థాయిలో ఇసుకతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సీఎంకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

హామీల అమలు ఏదీ..?

ఎన్నికల ముందు నిరుద్యోగులకు, ఉద్యోగులకు, రైతు, చేనేత తదితర వర్గాలకు అనేక హామీలను గుప్పించారని, అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలోకి తొక్కింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఉద్యోగులను నిండా ముంచిన ఘనుడు జగన్ అని అన్నారు. సభలు, సమావేశాల్లో నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీలు అంటూ.. వారి అభివృద్ధి, సంక్షేమానికి గండికొట్టింది నీవే జగన్ అని అన్నారు. అబద్ధపు ప్రసంగాలతో ప్రజలను మరోసారి మోసగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగాలు లేక యువత పక్క రాష్ట్రాలకు వలస వెళుతుంటే ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాను వ్యవసాయ, హార్టికల్చర్, పారిశ్రామిక రంగాలలో చంద్రబాబు అభివృద్ధి చేశారని అన్నారు. కియతో జిల్లాకి ఒక ల్యాండ్ మార్కు తీసుకువచ్చి.. ప్రపంచానికి చాటింది చంద్రబాబు అని అన్నారు. జే బ్రాండ్ల నాసికం మద్యంతో మహిళల తాళిబొట్లను జగన్ తెంచుతున్నారని విమర్శించారు.

నీటి దొంగ.. దుద్దుకుంట

ప్రజల దాహార్తిని తీర్చేందుకు భగవాన్ సత్యసాయి బాబా తాగునీటిని గ్రామాలకు అందిస్తుంటే, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ నీటిని తన తోటకు నాలుగేళ్ల నుంచి మళ్లించడం నిజంకాదా అని బాలకృష్ణ ప్రశ్నించారు. మామయ్య, అన్న, చిన్నాన్నను అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బ్యాంకులకే టోపీ పెట్టిన ఎమ్మెల్యే ప్రజలకు టోపీ పెట్టడా అని ఎద్దేవా చేశారు. ఇలాంటి ఎమ్మెల్యేను ఇంటికి సాగనంపాలని, కూటమి అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రం బాగుండాలనే ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ చంద్రబాబుతో జతకట్టారని అన్నారు. ఆయన రాకతో జగన్ వెన్నులో వణుకు పుడుతోందని అన్నారు.

ఒక రాజధానికే దిక్కులేదు: సింధూర



జగన్ మూడు రాజధానులు అంటున్నారని, ఐదేళ్లలో ఒక్క రాజధానికే దిక్కులేకుండా పోయిందని పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి విమర్శించారు. జగన్‌ను గెలిపిస్తే ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్ ఉండదని అన్నారు. ప్రజల మాన ప్రాణాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. మహిళలపై దౌర్జన్యాలు, అఘాయిత్యాలు జరుగుతుంటే ముసిముసి నవ్వులు నవ్వుతూ జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. ఏదైనా కష్టం ఉందని ప్రజలు, చిన్నారులు చెబితే.. జగన్ నవ్వుతూ హేళనగా చూస్తున్నారని విమర్శించారు. సభలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, జనసేన నియోజకవర్గ కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న కందికుంట వెంకటప్రసాద్, బీవీ వెంకటరాముడు, బాలయ్యతో సెల్ఫీ దిగుతున్న మహిళలు.. పుట్టపర్తి సభకు హాజరైన జనం

పోలీసుల సహకారం..?



పట్టుబడిన మద్యాన్ని వదిలేశారు

అధికార పార్టీవారి ఎన్నికల అవసరాలకే..

ప్రజాప్రతినిధి ఒత్తిడి వల్లే కేసు నీరుగార్చారా..?



హిందూపురం, ఏప్రిల్ 13 : ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభ పెట్టడానికి కర్ణాటక మద్యం తరలిస్తూ రెండ్రోజుల క్రితం పట్టుబడిన వాహనం పోలీసులకు చిక్కినట్లే చిక్కి తప్పించుకోవడం.. ఆ వాహనంలో ఓ కానిస్టేబుల్ ఉండటం.. దానిని అనుసరిస్తూ ద్విచక్రవాహనంలో అధికార పార్టీ మండల ప్రజాప్రతినిధి బంధువు ఉండటం చూస్తే అది ఎవరిదో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే కనుసన్నల్లో కర్ణాటక నుంచి ఆయన నియోజకవర్గానికి మద్యం తరలిస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం పట్టుబడటంతో గోప్యంగా ఉంచినా విషయం బయటకు పొక్కింది. దీంతో ఇప్పుడు కర్ణాటక మద్యం తరలింపు వ్యవహారం హిందూపురం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. మద్యం తరలింపు వెనుక అధికార పార్టీ హస్తం ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

యంత్రాంగం ఎక్కడ..?

కర్ణాటక నుంచి చిలమత్తూరు మీదుగా అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్న ఆ నియోజకవర్గానికి కొంతకాలంగా మద్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గతనెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నారు. కారులోనే మద్యం తరలిస్తున్నా యంత్రాంగం పట్టించుకోలేదంటే దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కర్ణాటక సరిహద్దులో రాత్రింబవళ్లు గస్తీ ఉంటారు. అయినా వారి కళ్లుగప్పి జిల్లాలోకి మద్యాన్ని తీసుకు వస్తున్నారంటే దీని వెనుక మతలబు ఏమిటో అన్న చర్చలు ఉన్నాయి. ఉన్నతాధికారులు మాత్రం సరిహద్దులో భద్రత కట్టుదిట్టం చేశామని, మొబైల్ తనిఖీలు, ఎంసీసీ టీమ్‌లు తిరుగుతున్నాయని అంటున్నారు.

కలిసి మెలిసి..

కర్ణాటక నుంచి తరలిస్తున్న మద్యం వెనుక కొంతమంది పోలీసులతోపాటు అధికార పార్టీకి చెందిన నాయకులు, వారి బంధువులు ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. దీనివల్లే ఉన్నతాధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. సేవించడానికి రెండు బాటిళ్లతో వెళ్తున్న కారును సీజ్ చేస్తారు. అందులో ఉన్న వ్యక్తులు ఎవరనేది లెక్కచేయకుండా కేసులు కడతారు. అలాంటిది కారులో దర్జాగా బాక్సులు బాక్సులే తరలిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి ఒకలెక్క, ఇతరులకు ఒకలెక్క ఉంటుందా అనే విమర్శలు ఉన్నాయి.

కేసు కట్టరా..?

కర్ణాటక నుంచి కారులో మద్యం తరలిస్తున్న సమయంలో చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్, అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధి బంధువు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో పోలీసులకు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నారా లేక ఉన్నతాధికారులు అధికార పార్టీ నేతల ఫోన్లు రావడంతో తప్పించారా అన్నది సర్వాత్రా అనుమానాలకు తావిస్తోంది. మద్యం తరలిస్తున్న కారులో కానిస్టేబుల్ ఉన్నాడని అతన్ని గోప్యంగా విచారించి వీఆర్‌కు పంపారు. అంతేకాక ఆ కారు సమీపంలో సదరు కానిస్టేబుల్ ద్విచక్రవాహనం ఉండటం, ఆ వాహనాన్ని అధికార పార్టీ నాయకుడు డ్రైవ్ చేస్తుండటం చూస్తే వారంతా కలిసి కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అలాంటప్పుడు సదరు కానిస్టేబుల్‌పై కేసు కట్టి సస్పెండ్ చేయాల్సి ఉండేది. అలా కాకుండా తూతూ మంత్రంగా విచారణచేసి కేసును నీరుగార్చినట్లు తెలిసింది.



ప్రజాప్రతినిధి ఒత్తిడి..?

జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి కారణంగానే కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయకుండా వీఆర్‌కు పంపి చేతులు దుపులుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. సదరు ముఖ్య ప్రజాప్రతినిధి పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఈ కేసును తప్పుదోవ పట్టించినట్లు సమాచారం. అందుకే పోలీసులు సైతం కేసు వివరాలు ఇప్పటికీ పూర్తిగా చెప్పడానికి నిరాకరిస్తున్నారు. ఆ నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి ఒత్తిడి ఈ కేసుపై బలంగా ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా అధికార పార్టీ నాయకులు కొంతమంది పోలీసులు కలిసి కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారన్నది నగ్నసత్యం.

అక్రమ మద్యం అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి


సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీ సుధాకర్‌రెడ్డి

పెనుకొండ, ఏప్రిల్ 13 : ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అక్రమ మద్యం రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం పెనుకొండ సెబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీ విలేకరులతో మాట్లాడుతూ.. కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్ర త్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. అక్రమంగా మద్యం నిలువ ఉంచిన గోదాములను గుర్తించి తనిఖీలు చేస్తున్నామని, రవాణా మార్గాల్లో ఎప్పటిక ప్పుడు తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. పాత నేరస్తులపై నిఘా పెట్టామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణాను కట్టడి చేశామన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 136కేసులు నమోదుచేసి 298లీటర్ల నాటుసారా, 17,170 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. పలు నేరాలకు సంబంధించి మొత్తం 696కేసులను నమోదు చేసి 105వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పెనుకొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	38.0 24.0	37.0 24.0	39.0 25.0	37.0 22.0	37.0 24.0

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

ధర్మవరం, ఏప్రిల్ 13: జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ పంపిణీని ఆయన శనివారం తనిఖీ చేశారు. నియోజకవర్గాలకు ఈవీఎం యూనిట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరు నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లకు ఎన్నికల సామగ్రిని ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపించామని ఆయన తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసులు భద్రత కల్పించారు. రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటశివరామిరెడ్డి పంపిణీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ధర్మవరం రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, తహసీల్దారు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు.. ఎన్నికల స్టేషనరీని సర్దుకుంటున్న సిబ్బంది

చదువుకోమంటే.. చచ్చిపోయారు..!

ఒకే రోజు ముగ్గురు విద్యార్థులు..

బిడ్డలారా.. అమ్మానాన్న ఏమైపోవాలి..?

బాగుపడమంటే.. ప్రాణం తీసుకుంటారా..?

ధర్మవరం/రొద్దం/తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 13: ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు, పరీక్షల్లో ఫెయిలౌతానన్న భయంతో ప్రాణం తీసుకున్నారు. తాము లేకుంటే అమ్మానాన్నలు ఏమైపోతారోనని ఒక్క క్షణం కూడా వారు ఆలోచించలేదు.



ఆత్మహత్య చేసుకున్న బాలుడు నాగచైతన్య

● బడికి వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఐదో తరగతి విద్యార్థి నాగ చైతన్య(11) ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో శనివారం ఈ ఘటన జరిగింది. ఆర్టీసీ డ్రైవర్ రంగప్ప, శ్రీదేవి దంపతుల కుమారుడు నాగచైతన్య ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. బడికి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు.. శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



● సెల్‌ఫోన్ వాడొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు తొమ్మిదో తరగతి విద్యార్థిని నందిని(14) ఆత్మహత్య చేసుకుంది. రొద్దం మండలం కె.మరువపల్లి గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. తన దత్త పుత్రిక నందిని ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తూ గడుపుతుండటంతో కుళ్లాయప్ప మందలించారు. పరీక్షల సమయంలో ఇలా మొబైల్ చూడటం మంచి పద్ధతి కాదని చెప్పి బయటకు వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన నందిని ఇంట్లో చీరతో ఉరివేసుకుంది. తల్లి కమలమ్మ ఆ సమయంలో స్నానానికి వెళ్లారు. తండ్రి తిరిగి వచ్చేలోగా నందిని ఉరికి వేలాడుతూ కనిపించింది. కిందకు దించి ఆసుపత్రికి తరలించేలోగా మృతిచెందింది. ఒక్కగానొక్క కూతురు బలవన్మరణానికి పాల్పడటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. నందిని పైడేటి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థిని.



● ఇంటర్ పరీక్షల్లో ఫెయిలవుతానన్న భయంతో ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఇందు (16) ఆత్మహత్య చేసుకుంది. కానీ ఫలితాలు వచ్చాక ఆమె పాసైనట్లు తేలింది. ఈ విషాద ఘటన తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, వరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ముగ్గురు సంతానం. రెండో కూతురు ఇందు అనంతపురంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఫెయిల్ అవుతానన్న భయంతో, ఫలితాలు రాకమునుపే శుక్రవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను అనంతపురం తరలించారు. కోలుకోలేక శనివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ఇందు 289 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కూతురు మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

21న మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి పరీక్ష

అనంతపురం విద్య, ఏప్రిల్ 13 : జిల్లాలోని 15 ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు అన్ని మండలాల్లోని మోడల్ స్కూళ్లలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను http://cse.ap.gov.in,https://apms.apcfss.in/StudentLogin.do వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష రాయవచ్చని తెలిపారు.

మార్కెట్‌కు 1,125 టన్నుల చీనీకాయలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 1,125 టన్నుల చీనీ ఉత్పత్తులు వచ్చాయి. టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.17 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

1 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తచెరువు, ఏప్రిల్ 13: మే ఒకటో తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని డీఐఈఓ రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల 18 నుంచి 24వ తేదీ వరకు కళాశాలల ప్రిన్సిపాళ్లకు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని తెలిపారు.

బందీఖానాలో భూములు

నమ్మించి నట్టేట ముంచిన నాటి పాలకులు

15 ఏళ్లుగా లేపాక్షి హబ్ బందీఖానాలో ఉన్న భూములు ఇవే..



● భూములు కోల్పోయి.. ఉపాధి లేక రైతుల వలసబాట
● 15 ఏళ్లుగా 8,844 ఎకరాల భూమి నిరుపయోగం
● లేపాక్షి హబ్‌కు భూములిచ్చిన రైతుల్లో తీవ్ర ఆవేదన

పుట్టపర్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సైన్స్ టెక్నాలజీ పార్కులొస్తాయి.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలొస్తాయి.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వస్తుంది.. మీ ప్రాంతమంతా పారిశ్రామిక హబ్‌గా మారి.. మీపిల్లకు కొలువులొస్తాయి.. మీ జీవితాలు మారిపోతాయంటూ లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌ను ప్రకటించినప్పుడు వైఎస్ ప్రభుత్వం చెప్పిన మాటలివి. అప్పట్లో అరచేతిలో వైకుంఠం చూపి.. సాగులో ఉన్న పేదల నుంచి భూములు సేకరించి లేపాక్షి హబ్‌కు కారు చౌకగా కట్టబెట్టారు. అసైన్డ్ భూమి ఎకరాకు రూ. 1.75 లక్షలు, ప్రభుత్వ భూమికి రూ. 50 వేల చొప్పున ధర నిర్ణయించి చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 8,844 ఎకరాల భూమిని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు రూ. 119.85 కోట్లకే కట్టబెట్టారు. చెప్పిన పరిశ్రమలు, ఉద్యోగాలు రాలేదు. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు తీసుకురాకపోగా వివిధ బ్యాంకుల్లో భూములను తాకట్టుపెట్టి కోట్ల రుణాలు పొందిన సంగతి తెలిసిందే. 15 ఏళ్ల కిందట చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో అప్పటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆయన కుమారుడు, ప్రస్తుత సీఎం జగన్‌కు సన్నిహితమైన ఇందూ గ్రూప్‌నకు అనుబంధంగా 2009లో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో భూములు కేటాయించారు. అప్పట్లో వీరి మాయమాటలకు నమ్మిమోసపోయిన రైతులు నేటికి పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉపాధి అవకాశాలు లేక పిల్లపాపలతో వలస బాట పడుతూనే ఉన్నారు. సాగు భూములు లేక చాలా మంది ఉపాధి కోల్పోయారు. లేపాక్షి హబ్ పేరుతో తమను రోడ్డుపాలు చేశారని రైతు కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.



కొడికొండ చెక్‌పోస్టు వద్ద లేపాక్షి హబ్ కార్యాలయం

ఇంకెన్నాళ్లు..?

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో జాతీయ రహదారి 44 జిల్లా సరిహద్దు చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 2006లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేసి పరిశ్రమల నిర్మాణం కోసం ఏపీఐఐసీ రైతుల నుంచి 8,844 ఎకరాలను సేకరించి లేపాక్షి హబ్‌కు విడతల వారిగా కట్టబెట్టింది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు తీసుకురాకపోగా వివిధ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి లేపాక్షి నాలెడ్జ్‌హబ్ వందల కోట్లు పైగా రుణాలు పొందిన సంగతి తెలిసిందే. భూములు తాకట్టు పెట్టి రుణం పొందడం, నిధులను పక్కదారి మళ్లించడం, నిబంధనలు అతిక్రమించడంపై 2013లో సీబీఐ విచారణ చేసింది. అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించి 3,800 ఎకరాలకుపైగా ఈడీకి అటాచ్‌మెంట్ చేశారు. ఆ భూములు నేటికి ఈడీ అటాచ్‌మెంట్‌లోనే మగ్గుతున్నాయి. అప్పట్లో లేపాక్షి హబ్ రూ. 119.85 కోట్ల వరకు రైతుల భూములకు పరిహారం రూపంలో ఇవ్వగా నేడు ఇవే భూములే రూ. 20 వేల కోట్ల దాకా పలుకుతున్నాయి. చాలా మంది సన్న చిన్న కారు రైతులు వచ్చిన పరిహారంతో బండ్లు, ఇల్లు, నగలు కొనేశారు. పరిశ్రమలు వస్తాయి ఉద్యోగాలు కల్పిస్తారు అని అనుకునేలోపే ఉన్నది కాస్త కరిగిపోయింది. సాగు చేసేందుకు భూములు లేక ఇచ్చిన భూములు పరిశ్రమలు రాకపోగా తమ భూములు బడాబాబులు బందీఖానాలో చిక్కుకుని నిరాశే మిగిల్చాయి.

కదిలిస్తే కంటతడి..

లేపాక్షి హబ్ కోసం భూములు కోల్పోయిన గ్రామాల్లో ఎవరిని కదిపినా కంటతడి పెడుతున్నారు. లేపాక్షిహబ్‌కు ఇచ్చేందుకు వైఎస్ ప్రభుత్వం చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 6,313 ఎకరాల అసైన్డ్ భూములు సేకరించింది. ఇందులో 5,811 ఎకరాలను హబ్‌కు ఇచ్చింది. 3032 ఎకరాల ప్రభుత్వ భూములూ ఇచ్చింది. పరిహారం మాత్రం నామమాత్రంలోనే నిర్ణయించి ఎకరా మెట్ట భూమికి రూ.1.75 లక్షలు, నీటివసతి ఉంటే రూ. 2లక్షల ఇచ్చింది. ప్రస్తుతం ఆ భూములన్నీ ఈడీ ఆధీనంలో మగ్గుతున్నాయి. కొందరు రైతులు పంటలు వేసుకుంటున్నారు. భూమి వారిపేరిట లేనందున రుణాలు, సబ్సిడీ విత్తనాలు రావు. పంట నష్టపోతే బీమాతోపాటు పంట నష్ట పరిహారం కూడా రాదు. 15 ఏళ్ల కిందట అందిన కొద్దిపాటి పరిహారం కాస్తా కర్పూరంలా కరిగిపోయింది. ఇప్పుడు ఎకరా రూ. 50 లక్షల నుంచి రూ. రెండు కోట్ల దాకా పలుకుతుంటే రైతు కుటుంబాల తీవ్ర మానసికక్షోభకు గురవుతున్నాయి.

రూ.5 కోట్ల రుణానికి..

ఢిల్లీ సంస్థ నుంచి కేవలం రూ.5 కోట్లు రుణం తీసుకున్న లేపాక్షిహబ్ రూ. 1600 కోట్లకు పైగా విలువ చేసే 2,650 ఎకరాల భూమి ప్రైవేట్ చేతుల్లో పెట్టింది. ఈ అడ్డగోలు వ్యవహారమంతా కుట్రలా కనిపిస్తోంది. లేపాక్షికి ఇచ్చిన 8,844 ఎకరాల్లో 4,181 ఎకరాలను ఇందూ సంస్థ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి అప్పు తీసుకుంది. లేపాక్షిహబ్ పేరుతో జరిగిన భూకుంభకోణంపై నాడు దర్యాప్తు చేసిన సీబీఐ తన చార్జీషీట్‌లో అప్పటి ముఖ్యమంత్రి తనయుడు, ప్రస్తుత సీఎం జగన్‌ను మొదటి నిందితుడిగా చేర్చింది. లేపాక్షి హబ్‌కు అక్రమంగా భూములు కేటాయించినందుకు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో రూ. 70 కోట్ల పెట్టుబడులుగా వచ్చాయని పేర్కొంది.

పొరుగు రాష్ట్రానికి..

పరిశ్రమలు ఏర్పాటు చేయించి భూములు కోల్పోయిన రైతు కుటుంబాలతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని అప్పట్లో లేపాక్షి హబ్ హామీ ఇచ్చింది. భూములు తీసుకుని పలు బ్యాంకుల్లో తనాఖా పెట్టి వందల కోట్లు తీసుకుని భూములను ఈడీ అటాచ్‌మెంట్‌లోకి ఇరికించి రైతుతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోగా తీవ్రంగా మోసం చేసింది. లేపాక్షి హబ్‌కు భూములు ఇచ్చిన వేలాది మంది రైతు కుటుంబాలు కొన్నేళ్లుగా ఉపాధి కోసం చాలా మంది కర్ణాటకకు వలస పోతూనే ఉన్నారు. ఐదేళ్ల కిందట టీడీపీ హయాంలో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో కియ కార్ల పరిశ్రమ పెనుకొండకు రాకతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. కియ పరిశ్రమతోపాటు అనుబంధ సంస్థల నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభించాయి. అమ్మడి అనంత జిల్లాకు పారిశ్రామికంగా అభివృద్ధికి బాటలు వేసి పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్ల గడిచినా కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా 15ఏళ్ల బందీఖానాలో పెట్టుకుని భూములు చిక్కుముడి తేల్చకపోవడంతో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక పరిశ్రమలు వస్తాయా అన్న ఆశతో నేటికి ఎదురుచూస్తోంది.



లేపాక్షి హబ్ లోగో

బజారున పడ్డాం



భూములు ఇస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇస్తామని ఆ రోజు ప్రభుత్వం చెప్పింది. ఎన్నో ఏళ్లగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న భూములను పరిశ్రమల పేరుతో అప్పట్లో ప్రభుత్వం లాగేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు భూములు కోల్పోయిన మాకు ఉపాధి చూపలేదు. ఒక పక్క భూములు కోల్పోయి, మరోపక్క ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోవడం కోసం కర్ణాటకకు వెళుతున్నాం. వేల ఎకరాలు తీసుకొని ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు. పిల్లలకు భవిష్యత్తు లేకుండా పోయింది. తీసుకున్న భూములను వెనక్కి ఇవ్వాలి. లేదంటే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. **- గంగాధర్, చిన్నప్పరెడ్డిపల్లి, చిలమత్తూరు మండలం**

కారుచౌకగా కొట్టేశారు



మాయ మాటలు చెప్పి అప్పట్లో మా భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో కారుచౌకగా కొట్టేశారు. భూములు ఇస్తే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, ఉద్యోగాలు వస్తాయని ఆశ చూపారు. ఎకరం భూమిని కేవలం రూ. 1.75 లక్షలకే లాగేసుకున్నారు. ఇప్పుడు అదే భూములు ఎకరం కోటి వరకు ధర పలుకుతోంది. కనీసం భూములు కోల్పోయిన మాకు 15 ఏళ్లగా ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు పొట్ట చేతపట్టుకొని పరాయి రాష్ట్రాలకు వెళ్లి బతుకు సాగించాల్సి వస్తోంది.

- సూర్యనారాయణ, కంబాలపల్లి, చిలమత్తూరు మండలం

నేటి నుంచి యోగి వేమన బ్రహ్మోత్సవాలు



యోగి వేమన ఆలయం



గాండ్లపెంట, ఏప్రిల్ 13: మండలంలోని కటారుపల్లిలో గల మహాకవి యోగివేమన ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14వ తేదీన మహాశక్తి పూజ, కుంభం పోయిట నిర్వహిస్తారన్నారు. 15న చాందినీ బండ్ల మెరవణి, పానక పందేరాలు ఉంటాయన్నారు. 16న ఉట్ల తిరుణాళ్ల, రాత్రి 8గంటలకు అగ్ని సేవ ఉంటాయన్నారు. 17న బుధవారం గొడుగుల మెరవణి నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 13: రైతుల ఖాతాల్లో పంటనష్ట పరిహారాన్ని వెంటనే జమ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత సంవత్సరం జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన రూ.251 కోట్ల పరిహారం అమలు కాలేదని విమర్శించారు. అనంతపురం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నెలన్నర అయినప్పటికీ ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాలకు జమ కాలేదన్నారు. రైతులు నష్టపోయిన పంటల విలువతో పోలిస్తే ప్రభుత్వం చెల్లించేది అతి తక్కువ పరిహారమేనని, అదికూడా సకాలంలో చెల్లించకపోవడం వారిని దగా చేయడమే అన్నారు. గతేడాది వర్షాలు లేకపోవడంతోపాటు ఈ రబీలో ఎండలు ఎక్కువై భూగర్భ నీటిమట్టం తగ్గి తోటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వందల ఎకరాల్లో అరటి, చీనీ తోటలు ఎండిపోతున్నాయన్నారు. ఎన్నికల హడావిడిలో రైతులను, వారు ఎదుర్కొంటున్న కష్టాల గురించి పట్టించుకునే పరిస్థితిలో అధికార యంత్రాంగం లేదని విమర్శించారు. పంటనష్ట పరిహారంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ కలిపి చెల్లిస్తే తప్ప రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసే పరిస్థితులు లేవన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.51.27 లక్షల సీజ్



గుంతకల్లులో సీజ్‌చేసిన నగదును చూపుతున్న సీఐ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎలాంటి రసీదులు, బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న నగదును అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ రెండు జిల్లాలో మొత్తం రూ.51.27 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్లులో రూ.2.50లక్షల నగదును సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. ఆలూరు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టామన్నారు. గుంతకల్లు మండలం సంఘాల గ్రామానికి చెందిన ఎస్ రామాంజనేయులు ఆదోని నుంచి కారులో నగదును తీసుకెళ్తున్నాడన్నారు. రైల్వే బ్రిడ్జివద్ద వాహనాలు తనిఖీలు చేయగా రూ.2.50 లక్షలకు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకుండా తీసుకెళుతుండడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ధర్మవరంలో 2.82 లక్షలు..

ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.2.82 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం స్థానిక ఎర్రగుంట్ల సర్కిల్లో తనతోపాటు ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశామన్నారు. బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్వేటి రామాంజినేయులు ఎలాంటి బిల్లులు లేకుండా వాహనంలో రూ.2.82లక్షల నగదును తీసుకుకెళ్తుండటంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనంతపురంలో రూ.1.65 లక్షలు..

అనంతపురం వన్‌టౌన్ పోలీసులు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంతో కలిసి రూ.1.65లక్షల డబ్బు సీజ్ చేశారు. శనివారం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, సిబ్బందితో కలిసి మార్కెట్‌యార్డు సమీపంలో తనిఖీలు నిర్వహించారు. కేరళకు చెందిన అన్వర్‌బాషా నుంచి రూ.1.65లక్షల నగదు తీసుకెళ్తుండగా ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ డబ్బు సీజ్ చేశారు.

తాడిపత్రిలో రూ.22 లక్షలు..

ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.22లక్షల నగదును సీజ్‌చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని కొత్తబ్రిడ్జి వద్ద సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు గౌస్‌బాషా, నాగీరయ్య వాహనాలు తనిఖీ చేశారన్నారు. పట్టణంలోని కృష్ణాపురం 2వరోడ్డుకు చెందిన షేక్ సాదిక్, షేక్ మునీర్‌బాషా ద్విచక్రవాహనంపై రూ.22లక్షల నగదు తరలిస్తున్నట్లు గుర్తించారని అన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలను చూపించకపోవడంతో సీజ్‌చేశామన్నారు. సమావేశంలో ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ టీం ఇన్‌చార్జ్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాడిపత్రి డీఎస్పీ, సీజ్‌చేసిన నగదు

హిందూపురంలో రూ. 15.10 లక్షలు..

హిందూపురం పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడినట్లు టూటౌన్ సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు. శనివారం గౌరీబిదనూరుకు చెందిన నాగరాజు, చంద్రశేఖర్ వద్ద రూ. 8లక్షలకు పైగా పట్టుబడిందన్నారు. ఈ నగదుని సీజ్ చేసి ట్రెజరీకి తరలించినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా కొడికొండ చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారులో రూ. 7.10 లక్షలు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

తనకల్లులో రూ.7.20 లక్షలు..

తనకల్లు మండల పరిధిలోని చీకటిమానుపల్లి చెక్ పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేసి రూ.7.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గోరంట్ల మండలం కొత్తబయ్యన్నపల్లికి చెందినవడ్డే శ్రీనివాసుల వద్ద రూ.లక్ష, ఓడీసీ మండలం సున్నంపల్లికి చెందిన సుబహాన్ వద్ద రూ.91,800, మల్లెవాండ్లపల్లికి చెందిన గంగన్న వద్ద రూ.లక్ష, బసప్పగారిపల్లికి చెందిన రమణప్పవద్ద రూ.లక్ష, చెర్లోపల్లికి చెందిన హనుమంతు వద్ద రూ.90వేలు నగదు పోలీసులు స్వాధీనంచే సుకున్నారు. గోరంట్ల మండలం కొత్తబయ్యన్నపల్లికి చెందిన వడ్డె లక్ష్మీనారాయణ వద్ద రూ.2.41 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

బాలయ్యకు ఘన స్వాగతం


హెలిప్యాడ్ వద్ద కూటమి శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న బాలకృష్ణ

కదిరిఅర్బన్, ఏప్రిల్ 13: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణకు కదిరిలో శనివారం ఘన స్వాగతం లభించింది. కూటమి అభ్యర్థుల తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఆయన నవ్యాంధ్ర సాకారం పేరిట అన్‌స్టాపబుల్ బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమానికి కదిరి నుంచి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో శనివారం బెంగళూరు నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్దకు బాలకృష్ణ చేరుకున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అభిమానులు, కూటమి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి బాలయ్యకు స్వాగతం పలికారు. అలాగే కరచాలం చేయడానికి పోటీ పడ్డారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీన్‌బాను, డైమండ్ ఇర్ఫాన్, మోపూరి శెట్టి చంద్రశేఖర్, క్రిష్ణమోహన్‌నాయుడు, బాబ్‌జాన్, అల్లా ముస్తఫా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలకృష్ణ కారు తనిఖీ

కదిరి: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలక్రిష్ణ కదిరిలోని లక్ష్మీనరసింహ స్వామి దర్శించుకోవడానికి శనివారం ఆలయానికి వచ్చారు. ఆలయం వద్ద ఆయన కారును ఎన్నికల సంఘం అధికారులు తనిఖీ చేశారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.37/2023
మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
బి.సోమశేఖర్ మరియు ఇతరులు
- అపోనెంట్స్
అపోనెంట్ 1 కినోటీసు
1.బి.సోమశేఖర్ తండ్రిః బి.శ్రీనివాసయ్య, వయస్సుః 35 సం॥లు, వ్యాపారం, నివాసం: డో.నెం. 1-68-8E, మండిబజార్, మారుతి నగర్,కదిరి టౌను, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 16,50,395/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1కి అపోనెంట్ అయిన మీరు 24-04-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.39/2023
మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
బి.సోమశేఖర్ మరియు ఇతరులు
- అపోనెంట్స్
అపోనెంట్ 1 కినోటీసు
1.బి.సోమశేఖర్ తండ్రిః బి.శ్రీనివాసయ్య, వయస్సుః 35 సం॥లు, వ్యాపారం, నివాసం: డో.నెం. 1-68-8E, మండిబజార్, మారుతి నగర్,కదిరి టౌను, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 6,30,346/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1కి అపోనెంట్ అయిన మీరు 24-04-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.82/2023
మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
సయ్యద్‌షఫీ మరియు ఇతరులు - అపోనెంట్స్
అపోనెంట్ 1 మరియు 3 కినోటీసు
1.సయ్యద్ షఫీ తండ్రిఃయస్.సైదుసాబ్, వయస్సుః55సం॥లు. ఉద్యోగి: జూనియర్ లైన్ మ్యాన్, ఎపియస్‌పిడిసియల్, కదిరి నివాసం:డో.నెం.11-15, పాతకుమార వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
3.యం.ముబారక్ అలీఖాన్ తండ్రిః యం.ఇబ్రహీమ్ ఖాన్, వయస్సుః 56 సం॥లు. ఉద్యోగి: స్కూల్ అసిస్టెంట్, జెడ్.పి. హైస్కూల్, ధనియాని చేరుగు, యన్.పి.కుంట మం॥ నివాసం: డో.నెం.9-498-1, కుమార వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 4,05,133/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1 మరియు 3కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.81/2023
మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
డి.రాజశేఖర్ రెడ్డి మరియు ఇతరులు - అపోనెంట్స్
అపోనెంట్ 2,3 మరియు 4 కినోటీసు
2.దాదిరెడ్డివిశ్వనాథరెడ్డి తండ్రిఃడి.చెన్నారెడ్డి, వయస్సుః53సం॥లు. ఉద్యోగి: పంచాయతీ సెక్రటరీ మండల ప్రజా పరిషత్ ఆఫీసు ఓ.డి.చెరువు మం॥ నివాసం:డో.నెం.20-159, గోపేపల్లి గ్రామం, నల్లచెరువు మం॥ శ్రీ సత్యసాయి జిల్లా.
3.రమావత్ చంప్ల నాయక్ తండ్రిః ఆర్.గనే నాయక్, వయస్సుః52సం॥లు. ఉద్యోగి: యస్.జి.టీచర్ యంపియుపి స్కూల్ మసుకవంకపల్లి గ్రామం, నల్లచెరువు మం॥ నివాసం:డో.నెం.1-153,పోలీసు స్టేషన్ దగ్గర, నల్లమాడ మం॥ శ్రీ సత్యసాయి జిల్లా.
4.రమావత్ మురళీ నాయక్ తండ్రిః ఆర్.రామునాయక్, వయస్సుః51సం॥లు. ఉద్యోగి: అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఎంప్లాయి ఐడినెం.500159, చిన్నరాయిని పల్లి, ఎయస్‌పట్నం, నివాసం:డో.నెం. 19-111, అరవాండ్లపల్లి తాండ, నల్లమాడ మం॥ శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 3,44,576/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 2,3 మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.14/2024
మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
యం.ప్రతాప్ మరియు ఇతరులు
- అపోనెంట్స్
అపోనెంట్ 2మరియు4 కినోటీసు
2.ముసలప్ప గారి మధు తండ్రిః యం రామన్న, వయస్సుః 32 సం॥లు, ఉద్యోగి: పోలీసు కానిస్టేబుల్, పి.సి.నెం 1556, ఆఫీసు/ఆఫ్, పోలీసు స్టేషను, ఓడిచెరువు నివాసం: డో.నెం.16-115-11, కుటాగుళ్ళ గ్రామం, కదిరి మం॥ , శ్రీ సత్యసాయి జిల్లా.
4. యం.దామోధర్ తండ్రిః యం.గోవిందప్ప, వయస్సుః 35 సం॥లు, ఉద్యోగి: పోలీసు కానిస్టేబుల్, పి.సి.నెం 1599, ఆఫీసు/ఆఫ్, పోలీసు స్టేషను, పట్నం.నివాసం:డో.నెం.6-450, యస్.సి.కాలనీ.ఘంటాపురం గ్రామం, బత్తలపల్లి మం॥, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 3,09,704/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 2 మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.84/2023
మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కదిరి బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
యం.ప్రతాప్ మరియు ఇతరులు
- అపోనెంట్స్
అపోనెంట్ 2మరియు4 కినోటీసు
2.ముసలప్ప గారి మధు తండ్రిః యం రామన్న, వయస్సుః 32 సం॥లు, ఉద్యోగి: పోలీసు కానిస్టేబుల్, పి.సి.నెం 1556, ఆఫీసు/ఆఫ్, పోలీసు స్టేషను, ఓడిచెరువు నివాసం: డో.నెం.16-115-11, కుటాగుళ్ళ గ్రామం, కదిరి మం॥ , శ్రీ సత్యసాయి జిల్లా.
4. శ్రీమతి నాను గిరిజ భర్తః యం.ప్రతాప్ వయస్సుః 33 సం॥లు, నివాసం: డో.నెం. 17-233-1ఎ, కుటాగుళ్ళ గ్రామం, కదిరి మం॥ , శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 4,33,422/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 2 మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.18/2024
మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
వై.బాలరాజు మరియు ఇతరులు - అపోనెంట్స్
అపోనెంట్ 3 మరియు 4 కినోటీసు
3.ఎ.పి.బాల నరసింహులు తండ్రిః ఎ.పి.మారెప్ప, వయస్సుః46సం॥లు. ఉద్యోగి: స్కూల్‌అసిస్టెంట్, జెడ్.పి.హెచ్.స్కూల్, వెంకటాంపల్లి గ్రామం,సి.కె.పల్లి మం॥ నివాసం:డో.నెం.7-63,పెద్దమేఘలయ పల్లి గ్రామం, సి.కె.పల్లి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
4.వి.వెంకటరాముడు తండ్రిః వి.మునెప్ప, వయస్సుః 43 సం॥లు. ఉద్యోగి: యంపి.పి స్కూల్ మోత్రపల్లి గ్రామం, గోరంట్ల మం॥ నివాసం: డో.నెం.1-244, పాల సముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 1,13,945/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 3 మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

తండాల అభివృద్ధికి కృషి: కందికుంట


సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

తనకల్లు/ నల్లచెరువు/ గాండ్లపెంట, ఏప్రిల్ 13: కూటమి అధికారంలోకి రాగానే గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తానని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని వీవీఆర్ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గిరిజనుల సమావేశం జరిగింది. ఇందులో కందికుంట పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో గల యువత నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతోనే గిరిజనులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదే అన్నారు. తండాల అభివృద్ధికోసం గిరిజనులు కలిసి కట్టుగా పని చేయాలని చెప్పారు. కూటమి అధికారంలోకి రాగానే తండాల అభివృద్ధిపై ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి గెలుపే ధ్యేయంగా గిరిజన యువత పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీరాములనాయక్, ఉత్తన్ననాయక్, సర్పంచ్ కాంతమ్మ, కాలేనాయక్, వివిధ మండలాల గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గిరిజన నృత్యం

సమావేశం ప్రారంభమయ్యేంతవరకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలు చేసి అలరించారు. వేల సంఖ్యలో వచ్చిన గిరిజనులు ఆనందంతో కేరింతలు కొడుతూ నృత్యంలో పాలుపంచుకున్నారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్ చేరిక

● కండువాలు వేసి ఆహ్వానించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, మాజీమంత్రి పల్లె


టీడీపీలోకి చేరిన కౌన్సిలర్ లక్ష్మణ్, సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర

పుట్టపర్తి, ఏప్రిల్ 13: పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. దీంతో వైసీపీకి షాక్‌మీద షాక్ తగులుతోంది. తాజాగా శనివారం పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మణ్ ఆయన సోదరుడు రామారావుతో పాటు 5 వేల మంది యువత టీడీపీలోకి చేరారు. మొదట రామలక్ష్మణ్ యువత స్థానిక సత్యమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. తర్వాత అక్కడి నుంచి బైకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ కర్ణాటక నాగేపల్లి, బుక్కపట్నం, కొత్తచెరువు సర్కిల్, మామిళ్లకుంట క్రాస్, ప్రశాంతిగ్రామం , బ్రాహ్మణపల్లి, బీడుపల్లి మీదుగా సాగి తిరిగి సత్యమ్మ ఆలయ సర్కిల్‌కు చేరుకుంది. ర్యాలీలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, ఆమె భర్త పల్లె కిశోర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తిచంద్రశేఖర్, రామలక్ష్మణ్‌లు పాల్గొన్నారు. అనంత రం సత్యమ్మ ఆలయం వద్ద భారీ సభ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, పల్లె సింధూర సమక్షంలో రామలక్ష్మణ్‌లు, యువత టీడీపీలోకి చేరారు. వారికి బీవీ వెంకటరాముడు, పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వైసీ పీ ఆధ్వర్యంలో జరుగుతున్న అవినీతిని మాజీ మంత్రి పల్లె ఎండగట్టారు. కూటమి అధికారంలోకి వస్తే అన్నివిధాలుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీవీ వెంకరాముడు మాట్లాడుతూ కూటమి గెలుపునకు ప్రతిఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పల్లె సింధూర మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయని తెలిపారు. రైతులకు కూడా మంచి రోజులు వస్తాయని ఆమె పేర్కొన్నారు.

కొత్తచెరువు : కొత్తచెరువు మీదుగా సాగిన బైక్ ర్యాలీకి స్థానిక టీడీపీ,జనసేన , బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అక్కడ పల్లెసింధూర,రామలక్ష్మణ్ తదితరులు శ్రీకృష్ణదేవరాయలు, వాల్మీకి, కనకదాసు, వడ్డేఓబన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాగతం పలికిన వారిలో మాజీ సర్పంచ్ మాణిక్యంబాబా, మండల, పట్టణ కన్వీనర్‌లు రామకృష్ణ, ఒలిపి శీన, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బండ్లపల్లిరాజు తదితరులు ఉన్నారు.

వైసీపీ సర్పంచ్ చేరిక


తుమ్మలకుంట్లపల్లిలో టీడీపీలో చేరినవారితో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు: మండలంలోని తుమ్మలకుంట్లపల్లి పంచాయతీ వైసీపీ సర్పంచ్ వేళ్లమద్ది శ్రీదేవి, వలంటీర్లతో పాటు 150కుటుంబాల వారు టీడీపీలో చేరారు. తుమ్మలకుంట్లపల్లిలో శనివారం వారు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి టీడీపీలోకి చేరినట్లు సర్పంచ్ శ్రీదేవి తెలిపారు. వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి జరగలేదన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చానని, అయితే జగన్‌పాలనలో వాటిని నెరవేర్చలేకపోయానని, ప్రజలు క్షమించాలని ఆమె కోరారు. టీడీపీలోకి చేరినవారిలో లక్ష్మీనరసింహనాయుడు, సుధాకర్ నాయుడు, బుట్టి రాము, మనోరంజని, వేళ్లమద్ది చిన్నరంగప్ప, రాజప్ప, ఎర్రమనేని చంద్ర, ఎర్రమనేని చంద్రమౌళి, ఉషారాణి, బీరే అశోక్, సాంబమూర్తి, నార వెంకటేష్, నార శివకుమార్, ఎర్రమనేని శంకర్, ఎర్రమనేని సురేష్, ఈశ్వరయ్య, నాగముని, నాగమునెమ్మ, జయమ్మ, శాంతమ్మ ఉన్నారు.

ఆరు కుటుంబాలు చేరిక

కొత్తచెరువు: మండలంలోని పోతులకుంటకు చెం దిన ఆరు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మండలకేంద్రం సమీపంలో శనివారం వారు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీ లోకి చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో రామచం ద్రారెడ్డి, నాగేశం,ఆంజనేయులు, ఆదెప్ప, కోనప్ప, సూరి తదితరులు ఉన్నారు.

ఘనంగా తమిళ నూతన సంవత్సర వేడుకలు


పాటలు పాడుతున్న తమిళ భక్తులు

పుట్టపర్తి, ఏప్రిల్ 13: పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో శనివారం తమిళ నూతన సంవత్సర వేడుకలను ఆ రాష్ట్ర భక్తులు ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయిమహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు వేదపఠనంతో తమిళనూతన సంవత్సర వేడుకలు ప్రారంభించారు. తర్వాత కళాకారులు సత్యసాయి ప్రేమతత్వంపై కమనీయమైన పాటలు పాడారు. అలాగే సాయిసంగీతిక బృందం సభ్యులు వాయిద్య గాన కచేరి చేసి భక్తులను అలరించారు. అదేవిధంగా కేరళనూతనసంవత్సరం వేడుకలను కూడా ఆ రాష్ట్ర భక్తులు జరుపుకున్నారు. వేడుకల్లో ఉభయ రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాదిమంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నల్లమాడ, ఏప్రిల్ 13: మండలంలోని పేమనకుంటపల్లి, అప్పయ్యగారిపల్లితో పాటు మండలకేంద్రంలోని మేదరవీధి, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు, అక్కమ్మగారి వీధిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కుచ్చెపు చంద్ర అధికారులను కోరారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవి వల్ల బోర్లలో భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. దీంతో నీటి సమస్య నెలకొందన్నారు. గుక్కెడు నీటికోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. సమస్య తెలిసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నకేశవుడికి వెండి బిందె వితరణ

తాడిమర్రి, ఏప్రిల్ 13: మండల కేంద్రంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి స్థానికులైన గోరంట్ల ఆచార్యులు కుమార్తె రుక్మిణమ్మ కుటుంబీకులు శనివారం వెండి బిందెను వితరణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి ప్రతి రోజూ ఉదయం అభిషేకం చేసేందుకు నీటిని కోనేటి బావి నుంచి తెస్తామని, ఇందు కోసం ఈ బిందెను ఉపయోగించనున్నట్లు ఆలయ అర్చకులు జయరామయ్య తెలిపారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో బాలకృష్ణ

కదిరి, ఏప్రిల్ 13: పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని శనివారం హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సందర్శించారు. ఆయన్ను అర్చకులు ఆలయంలోకి ఆహ్వానించారు. బాలకృష్ణ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయన్ను సత్కరించి స్వామి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. తర్వాత ఆలయం నుంచి బయటకు వచ్చి కూటమి శ్రేణులకు, అభిమానులకు అభివాదం చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు ఉన్నారు.

అలాంఖాన్‌వలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

పట్టణంలోని అలాంఖాన్‌వలీ దర్గాను బాలకృష్ణ సందర్శించారు. అక్కడ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆయనతో సెల్ఫీ దిగడానికి పోటీపడ్డారు.


బాలకృష్ణకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు


అలాంఖాన్ వలీ దర్గాలో బాలయ్య

చిత్రావతి నీటితో దాహార్తి తీరుస్తాం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి


చిల్లవారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీకే పార్థసారధి, సత్యకుమార్‌యాదవ్

తాడిమర్రి, ఏప్రిల్ 13: గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామని ధర్మవరం నియోజకవర్గ కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకేపార్థసారధి పేర్కొన్నారు. మండలంలోని చిల్లవారిపల్లి, నాయనపల్లి, దాడితోట, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, మోదుగులకుంట గ్రామాలలో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనుల్ని వివరించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామని తెలిపారు. మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటిని ఉపయోగించి జలజీవన్ మిషన్ ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే ఇతర సమస్యలు తీర్చడంతో పాటు ఇంటిస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయిస్తామన్నారు. చిత్రావతి ముంపు గ్రామాలలో ఇప్పటికీ పరిహారం అందని వారికి వెంటనే అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు జనార్దన్ పతకమూరి, శేఖర్, సాయి, రఘురాంచౌదరి, ఆదినారాయణ, హర్ష, అశ్వర్థ, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి యలవగంపోత్సవం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 13: మండలంలోని కొక్కంటివారిపల్లిలో శనివారం చెన్నకేశవస్వామి యలవగంపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ని ర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రతి ఇంటి నుంచి పసుపుకుంకుమ, పూవులు స్వామివారికి సమర్పించి మొ క్కులు తీర్చుకున్నారు. ప్రధాన వీధుల్లో ఉరుము, వాయిద్యాల నడుమ యలవగంపను ఆల యం వరకు ఊరేగించి.. తర్వాత స్వామికి సమర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. మండలం నలుమూలలనుంచి భక్తులు పాల్గొన్నారు.

వైసీపీకి న్యాయవాది రాజశేఖర్ రాజీనామా

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 13: మండలంలోని తంగేడుకుంట పంచాయతీకి చెందిన న్యాయవాది, రెస్కో మాజీ చైర్మన్ రాజశేఖర్ వైసీపీని వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి శనివారం ఆయన రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రికి, పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్లనే తాను పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చింతామణి, ఏప్రిల్ 13: కదిరి పట్టణం నుంచి కర్ణాటకం రాష్ట్రంలోని చింతామణి తాలూకా మురగమల్లె గ్రామంలోని అమ్మాజాన్, బావాజాన్ దర్గాకు వెళ్తున్న వ్యాన్ ఒకటి అదుపు తప్పి మోరీని ఢీ కొంది. శనివారం ఉదయం చోటు చేసుకున్న ఘటనలో వ్యాన్‌లోని నలుగురు గాయపడ్డారు. వ్యాన్ డ్రైవర్ మస్తాన్ , ప్రయాణికులు రహమత్, ముంతాజ్ , షాకీర్ లు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు మురగమల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కదిరి ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఆరేళ్ల షాకీర్‌కు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని బట్లహళ్లి పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

బత్తలపల్లి, ఏప్రిల్ 13:మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించారు. జిల్లా నలములల నుంచి వాల్మీకి సంఘ నాయకులు హాజరై విగ్రహానికి పూజలు చేశారు. అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజేష్, నాయకులు బంగారు క్రిష్ణమూర్తి, మండలశ్రీనివాసులు, రాము, రమేష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన అరిగెల భాస్కర్

ధర్మవరం, ఏప్రిల్ 13: పట్టణానికి చెందిన అరిగెల భాస్కర్ జనసేనలోకి చేరారు. ఆయన తన కుమారుడితో తిరుపతిలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను శనివారం కలిసి జనసేనలోకి చేరారు. ఈయన గతంలో జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల కొద్దికాలంగా పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే ప్రస్తుతం మళ్లీ జనసేనలోకి చేరగా పవన్‌కల్యాణ్ కండువా వేసి ఆహ్వానించారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, ఏప్రిల్ 13: మండలంలోని ఉస్తిలిపల్లి గ్రామం వద్ద శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ధరణి బాబు తెలిపారు. వారినుంచి రూ.11,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 13: ముదిగుబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాతవూరు, గుడ్డంపల్లితండాలలో అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ప్రజలు వాపోయారు. గుంజేపల్లి ఫీడర్‌లోని పాతవూరు, గుడ్డంపల్లితండాలలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ కోత ఏర్పడిందని పేర్కొన్నారు. అసలే వేసవి కాలం కావడంతో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు ఏవైనా మరమ్మతులు ఉంటే ఉదయం చేసుకోవాలన్నారు. మధ్యాహ్న సమయంలో కరెంట్ తీస్తుండడంతో ఉక్కపోతకు అల్లాడిపోతున్నామన్నారు. ఈ విషయంపై కదిరి ఏడీఈ బాలసుబ్రమణ్యంను వివరణ కోరగా గుంజేపల్లి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా పాతవూరు, గుడ్డంపల్లితండాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. సమస్యను పరిష్కరించామన్నారు.

కూలీ ఆత్మహత్య

ధర్మవరం, ఏప్రిల్ 13: పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ఓ కూలీ శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డికాలనీకి చెందిన ఉద్దండి నాగేంద్ర (43) కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. అయితే అతను తరచూ మద్యం తాగి కుటుంబసభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆరునెలల క్రితం భార్య రామసుబ్బమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. గత 20 రోజులక్రితం కుమారులపై కూడా అతడు దాడి చేసి గాయపరిచాడు. దీంతో నాగేంద్ర ధోరణి నచ్చక కుటుంబసభ్యులందరూ దూరంగా ఉంటున్నారు. నాగేంద్ర ఒక్కడే ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ఒంటరిగా ఉంటున్నానన్న మనస్థాపంతో శనివారం ఆయన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పరిశీలించారు. తర్వాత భార్య, కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఓటు నమోదుకు నేటివరకే అవకాశం

అగళి, ఏప్రిల్ 13 : మండలంలో 18సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటరు నమోదు చేసుకోవడానికి ఆదివారం చివరి రోజని తహసీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే వీలును ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 14న చివరి అవకాశం కల్పించిందని తెలిపారు. ఫారం-6 ద్వారా నమోదు చేసుకోనివారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

స్ట్రాంగ్ రూంల కోసం జేసీ పరిశీలన

పెనుకొండ, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎం ఓటింగ్ యంత్రాలను నిలువ ఉంచడానికి అవసరమైన కేంద్రాలను సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. అసెంబ్లీ ఓటింగ్ యంత్రాలను, బూత్‌ల వారీగా ఎన్నికల సామగ్రి భద్రపరచడానికి స్థానిక జూనియర్ కళాశాలలోని నాలుగు గదులను పరిశీలించారు. తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, సర్వేయర్లు కోదండపాణి, మైనుద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ధ్వంసంపై ఫిర్యాదు


అమ్మవారిపల్లి ఎస్సీ కాలనీలో ధ్వంసమైన సీసీరోడ్డు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని అమ్మవారిపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం సీసీరోడ్డు ధ్వంసం చేయడంపై గ్రామస్థులు గొడవపడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాగునీటి కోసం అమ్మవారిపల్లికి రామన్న ఎస్సీ కాలనీలో ఏకంగా సీసీరోడ్డు ను ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశాడని కాలనీ వాసులు అంటున్నారు. దీంతో కాలనీకి వెళ్లేందుకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని సుబ్బరాయుడు, తదితర ఎస్సీకాలనీవాసులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

కారు, బైకు ఢీ.. ఒకరికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 13: మండలంలోని కదిరి ప్రధాన రహదారిలో చలమయ్యగారిపల్లి వద్ద శనివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో సురేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కమ్మలవాండ్లపల్లికి చెందిన రాళ్లు కొట్టే కూలీ అయిన వడ్డె సురేష్, సోదరి ఉమతో కలిసి ద్విచక్రవాహనంపై గోరంట్లకు వచ్చాడు. పని ముగించుకుని తిరిగివెళ్తుండగా ప్రమాదం జరిగింది. చలమయ్యగారిపల్లి వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మిస్తున్న ప్రాంతంలో కదిరి నుంచి గౌరీబిదనూరు వెళ్తున్న కారు ద్విచక్రవాహాన్ని ఢీకొనింది. సురేష్ కుడికాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్‌వినోద్‌కుమార్ ప్రథమచికిత్స అనంతరం 108లో పుట్టపర్తి తరలించారు. ఉమ స్వల్పంగా గాయపడ్డారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్ 15: మండలంలోని పెరుమాళ్లపల్లికి చెందిన నరసింహ శనివారం కుటుంబ కలహాలతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పెరుమాళ్లపల్లికి చెందిన చంద్రప్ప కుమారుడు నరసింహ. భార్య నాలుగు నెలల కిందట పుట్టినింటికెళ్లి తిరిగిరాలేదని అతడు ఇంట్లోనే కొడవలితో గొంతుకోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. అతడిని వెంటనే కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి కితరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సల అనంతరం ప్రయివేటు అంబులెన్సులో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

పందుల చోరీపై కేసు

గోరంట్ల, ఏప్రిల్ 15: మండలంలోని చలమయ్యగారిపల్లికి చెందిన ఎరుకుల నరేష్‌కు చెందిన 15 పందులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు శనివారం కేసు నమోదైందని సీఐసుబ్బరాయుడు తెలిపారు. రెండురోజుల కిందట నరేష్‌కు చెందిన 15 పందులను గూడులో ఉంచగా, గుర్తుతెలియని వ్యక్తులు ప్రత్యేక వాహనంలో ఎత్తుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.2.10 లక్షలు విలువ ఉంటుందన్నారు. పందుల ఆచూకీ కోసం ప్రయత్నించగా, ఎలాంటి సమాచారం అందకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాంతులు, విరేచనాలతో వ్యక్తి మృతి

రొద్దం, ఏప్రిల్ 13 : మండలంలోని కే మరువపల్లికి చెందిన చాకలి కిష్టప్ప(34) వాంతులు, విరేచనాలతో మృతిచెందాడు. అతడికి శుక్రవారం రాత్రి వాంతులు, విరేచనాలు కాగా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అతడు డీహైడ్రేషన్ కారణంగా మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య నరసమ్మ, కుమార్తె ఉన్నారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి కుమారుడు సాయికల్యాణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకుడు అరుణ్‌రెడ్డి, గొల్లపల్లి కిష్టప్ప, తదితరులు ఉన్నారు.

ఆటోబోల్తా - ఏడుగురికి గాయాలు


ఆసుపత్రిలో ఉన్నవారిని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

మడకశిర రూరల్/ టౌన్, ఏప్రిల్ 13 : మండలంలోని గౌడనహళ్లిలో మలుపు వద్ద శనివారం ఆటో ఢీకొని ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గౌడనహళ్లికి చెందిన ఏడుగురు కూలీలు పనులు చేసేందుకు రోజూ మాదిరిగానే ఆటోలో మరువపల్లికి వెళ్లారు. పనులు ముగించుకుని శనివారం సాయంత్రం ఆటోలో గౌడనహళ్లి తిరిగి వస్తున్నారు. గ్రామ సమీపంలోని మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని ఆటో బోల్తాపడింది. అందులో ఉన్న కూలీలు అశ్వత్థమ్మ, నాగమ్మ, అంజక్క, ఆర్ అశ్వత్థమ్మతో పాటు ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాల య్యాయి. బంధువులు వారిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అందులో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న మడకశిర ప్రభుతాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్సలు అందించాలని డాక్టర్లను కోరారు. టీడీపీ నాయకులు కిష్టప్ప, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, ఈశ్వర్‌సాగర్ తదితరులు ఉన్నారు.

'పురం' రుణం తీర్చుకోలేనిది

✦ మూడోసారి ఆదరించండి
✦ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి


సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వసుంధరాదేవి

హిందూపురం, ఏప్రిల్ 13 : నందమూరి కుటుంబం ఎంత సేవ చేసినా హిందూపురం నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకోలేనిదని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హిందూపురానికి చేరుకున్న వసుంధరకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయంవద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం తెలిపారు. ఆమె ఆంజనేయస్వామి ఆలయంలో బాలకృష్ణ పేరుపై ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వసుంధరాదేవి విలేకరులతో మాట్లాడుతూ... హిందూపురం నియోజకవర్గం నుంచి ఎన్టీఆర్ మూడుసార్లు, హరికృష్ణ ఒకసారి గెలుపొందరన్నారు. అలాగే బాలకృష్ణ మూడోసారి ఎన్నికల రణరంగంలోకి దిగుతున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ తెలుగుదేశం పార్టీకి తప్ప వేరేపార్టీకి అవకాశం ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం పార్టీకి హిందూపురం కంచుకోట అని, హిందూపురం అంటే నందమూరి పురంగా పేరుగాంచిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ఎమ్మెల్యేలు ఎవరూ చేయలేని సేవ బాలకృష్ణ చేశారన్నారు. కరోనా సమయంలో సొంత నిధులతో కొవిడ్ బాధితుల కోసం స్థానిక ఆసుపత్రికి అత్యాధునిక వైద్య పరికరాలు, మందులు అందించారన్నారు. బాలకృష్ణ ఎక్కడున్నా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపైనే ఆయన ధ్యాస ఉంటుందన్నారు. మూడోసారి బాలకృష్ణ ఇక్కడి నుంచి పోటీలో ఉన్నారని, అందరూ కుటుంబసభ్యుడిలా ఆయనను దీవించాలని కోరారు. ఈ సారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వచ్చే ఐదేళ్లలో హిందూపురాన్ని రాష్ట్రంలోనే మూడో నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యతను బాలకృష్ణ తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ సోదరి నందమూరి లోకేశ్వరి, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ తేజశ్విని, టీడీపీ స్థానిక నాయకులు రమేష్, అనీల్‌కుమార్, అరుణాచల్‌రెడ్డి, కౌన్సిలర్లు రఘు, మంజుల, ప్రెస్ వెంకటేశ్, సర్పంచ్ మంజునాథ్, రవీంద్ర నాయుడు, ఉమాశంకర్‌రెడ్డి, చంద్రమోహన్, బాచి, అమర్నాథ్, నెట్టప్ప, ఆంజనేయులు, లేపాక్షి మండల కన్వీనర్ జయప్ప తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటేయండి

చిలమత్తూరు: బంగారు భవిష్యత్తు కోసం త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి ప్రజలను కోరారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు మద్దతుగా ఆమె శనివారం చిలమత్తూరు మండలంలో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అంధకారంలో ఉందని, రాష్ట్రానికి వెలుగులు రావాలన్నా, బంగారు భవిష్యత్తు కావాలన్నా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలు నందమూరి కుటుంబంపై ఎనలేని ప్రేమను చూపుతున్నారని, మీ రుణం నందమూరి, నారా వారి కుటుంబాలు మరవలేనివన్నారు. బాలకృష్ణ సేవలు మరింత కావాలంటే వచ్చే ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని కోరారు. అలాగే ఎంపీ అభ్యర్థి బీ.కే పార్థసారథిని గెలిపించాలన్నారు. ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆమె సెంటిమెంట్ ప్రకారం సోమఘట్ట మదుగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు.. ఈ రోడ్‌షో సోమఘట్ట, కొక్కోవాండ్లపల్లి, పలగలపల్లి, బందేపల్లి, బండ్లపల్లి, కల్లుకుంట, చాగలేరు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని, స్థానిక నాయకులు రంగారెడ్డి, దేమకేతేపల్లి అంజనప్ప, తిప్పారెడ్డి, శ్రీదేవి, రామాంజనమ్మ తదితరులు ఉన్నారు.


కొక్కోవాండ్లపల్లి ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న వసుంధరాదేవి

రాక్షస పాలనా... రామరాజ్యమా..?

మీరే నిర్ణయించుకోండి: కూటమి అభ్యర్థి సవిత


సి.కరావులపల్లి తండాలో మాట్లాడుతున్న సవిత

గోరంట్ల, ఏప్రిల్ 13: నిరంతరం అక్రమాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలతో సాగే వైసీపీ రాక్ష పాలన కావాలో లేక బడుగు బలహీనవర్గాల కోసం ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ రామరాజ్యం కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని టీడీపీ కూటమి పెనుకొండ అభ్యర్థి సవిత కోరారు. ఆమె శనివారం మండలంలోని మందలపల్లి, కరావులపల్లితండా, గడ్డంతండా పంచాయతీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి టీడీపీ అమలు చేసే సంక్షేమ పథకాలను వివరిస్తూ టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... గత టీడీపీ పాలనలో నియోజకవర్గంలో బీకే పార్థసారథి, నిమ్మల కిష్టప్ప చేసిన అభివృద్ధి పనులు మాత్రమే గ్రామాల్లో కనిపిస్తున్నాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పా లనలో చేసిందేమిటో గుర్తించాలన్నారు. అభివృద్ధి చేసే పార్టీని గుర్తించి గెలిపిం చాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నిమ్మల విద్యాధరణి, నిమ్మల యువశేఖర్, కొత్తపల్లి నరసింహప్ప, అశ్వత్థరెడ్డి, బాలక్రిష్ణచౌదరి, భాస్కర్‌రెడ్డి, కన్నారెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, క్రిష్ణనాయక్, షణ్ముకనాయక్, వేణు, రాము, సోము, కిషోర్, కమలాకర్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, మనోహర్ తదితరులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు టీడీపీలో చేరిక

పెనుకొండ టౌన్(సోమందేపల్లి) : వైసీపీ అరాచకాలు భరించలేక టీడీపీలో చేరుతున్నట్లు పలువురు పేర్కొన్నారు. సోమందేపల్లి మండలంలోని ఈదుల బళాపురం, రేణుకానగర్, తుంగోడు పంచాయతీ నుంచి 50కుటుం బాలు శనివారం సోమందేపల్లిలోని పార్టీ కార్యాలయంలో టీడీపీలోకి చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు ఐటీ ఉద్యోగుల ర్యాలీ

గోరంట్ల, ఏప్రిల్ 13: బెంగుళూరుచెందిన టీడీపీఫోరం ద్వారా ఐటీ ఉద్యోగులు గోరంట్లలో ఆదివారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తారని కూటమి అభ్యర్థి సవిత, పరిశీలకుడు నరసింహరావు తెలిపారు. గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశానికి ఐటీ ఉద్యోగులు విశ్వనాథ్, బాలాజీరాయల్ తదితరులు హాజరయ్యారు. ఒకప్పుడు తాము రైతు బిడ్డలమని, నేడు ఐటీ నిపుణులమన్నారు. చంద్రబాబు ఐటీ రంగాన్ని ప్రోత్సహించడం వల్లే తమకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. స్వగ్రామాల్లో ఐటీ రంగం అభివృద్ధికి , యువతకు ఉపాధి కల్పించేందుకు తమవంతు కృషిచేస్తున్నామన్నారు. ఐటీ రంగం అభివృద్ధికి ముమ్మరంగా కృషి చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. దీంతో టీడీపీ విజయం కోసం, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి పార్థసారథి కోసం ఆదివారం ర్యాలీ చేస్తున్నామన్నారు. వందలాదిమంది ఉద్యోగులు వస్తున్నారని, ర్యాలీ అనంతరం గ్రూపులుగా ఏర్పడి మండల, నియోజకవర్గంలో ఇంటింటికెళ్లి తమ అనుభవాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సవిత, నరసింహరావు కోరారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ సోముశేఖర్, కక్కల రఘునాథ్‌రెడ్డి, బాలక్రిష్ణచౌదరి తదితరులున్నారు.

పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 13: టీడీపీ సోషల్‌మీడియా కో-ఆర్డినేటర్‌లు సైనికుల్లా పనిచేయాలని, ప్రతి క్షణం పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి చేరే విధంగా కృషి చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోషల్‌మీడియా కోఆర్డినేటర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడాలన్నదే మనందరి లక్ష్యం అన్నారు. రాష్ట్రంతో పాటు ప్రజల భవిష్యత్తు, అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. భవిష్యత్తు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. పార్టీ కార్యక్రమాలశు ప్రజలకు చేర్చడంలో ముందుండాలని కోరారు. ప్రస్తుత సమాజంలో మీడియా రంగంతోపాటు సోషల్ మీడియా సమాజాన్ని ప్రభావితం చేస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులలు ఉన్నారు.

నేడు 'బాబు కోసం మేము సైతం' సమావేశం

మడకశిరటౌన్, ఏప్రిల్ 13: బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బాబు కోసం మేము సైతం కార్యక్రమాన్ని బెంగళూరులో నిర్వహించనున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. బెంగళూరులోని బగలగుంట ప్రాంతంలో ఉన్న శ్రీసాయి కల్యాణ మండపంలో కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాయుడు, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథితో పాటు పలువురు జిల్లా నేతలు హాజరవుతున్నట్లు తెలిపారు. మడకశిర నియోజకవర్గం నుంచి అత్యధిక శాతం ఉపాధి కోసం వెళ్లిన వారితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వారందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

పురంలో పోలీసుల కవాతు

హిందూపురం, ఏప్రిల్ 13: వచ్చే ఎన్నికల్లో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పోలీసులు కోరారు. హిందూపురం పట్టణంలో శనివారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని మీకు నచ్చిన అభ్యర్థికి వేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కేంద్రశాఖ బలగాలు, పాల్గొన్నాయి.

ఎన్నికల విధుల్లో జాగ్రత్త : డీఎస్పీలు

హిందూపురం, ఏప్రిల్ 13 : ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించాలని లేదంటే ఉద్యోగాలు ఊడతాయంటూ డీఎస్పీలు కంజాక్షన్, శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు ఎన్నికల విధులపట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ ఎన్నికల విధివిధానాలు, విధులపట్ల పోలీసులు వ్యవహరించాల్సిన తీరును వివరించారు. ఏరాజకీయ పార్టీకి కొమ్ము కాయకుండా ప్రజల పక్షాన ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా పోలీసులు వ్యవహరించాలన్నారు.

కష్టపడి చదివితేనే విద్యార్థులకు భవిష్యత్తు

గోరంట్ల, ఏప్రిల్ 13: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ లభిస్తుందని ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం కోరారు. మండలకేంద్రంలోని ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో 2021-24 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోటీ ప్రపంచలో శ్రమిస్తేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు భక్తవత్సలమ్మ, విజయలక్ష్మి, అధ్యాపకులు జునీద్‌బాషా, నందగోపాల్, అరవింద్, హరీష్, బాలమోహన్, కవిత, శ్వేత, నౌరిన్, పుష్పా, విద్యార్థులున్నారు.

హ్యాట్రిక్‌తో బాలయ్యను అసెంబ్లీకి పంపుదాం

ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని



హిందూపురం, ఏప్రిల్ 13 : నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ చేస్తున్న నందమూరి బాలకృష్ణను అత్యధికమెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ ఎమ్మెల్యే గా అసెంబ్లీకి పంపుదామని ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని పిలుపునిచ్చారు. నందమూరి వసుంధరాదేవి వెంట వచ్చిన ఆమె శనివారం విలేకరులతో మాటాడుతూ... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు, ఆయన ముందుచూపునకు నిదర్శనం తామే అంటూ కష్టకాలంలో ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ద్వారా తెలంగాణ, కర్ణాటకలో చేపట్టిన నిరసనలు అందరూచూశారని అన్నారు. అలాగే హిందూ పురంలో ఒకప్పుడు తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, అలాంటి దానిని పరిష్కరించిన ఘనత నందమూరి బాలకృష్ణకే దక్కిందన్నారు. ఈ ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సొంత నిధులతో నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి కృషిచేశారన్నారు. ఆయన గెలుపులో తమవంతు చిన్న సహాయం చేయడానికి ఐటీ ప్రొఫెషనల్ వింగ్ నియోజకవర్గ వ్యాప్తంగా పనిచేస్తుందన్నారు.

'శ్రమజీవులకు అండగా నిలిచేది టీడీపీనే..'

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 13: రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక, కర్షక శ్రమజీవులకు అండగా ఉండేది తెలుగుదేశం పార్టీ మాత్రమే అని మాజీ జడ్పీటీసీ ధనాపురం సూరి, వడ్డెర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమయ్య, మారుతి పేర్కొన్నారు. పరిగి మండల కేంద్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

హిందూపురం: తెలుగుదేశం పార్టీ రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలు మహిళలకు ఎంతో భద్రతనిస్తాయని టీడీపీ నాయకులుపేర్కొన్నారు. శనివారం 35వ వార్డులో క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్‌పై ఇంటింటికి వెళ్లి క్యాలెండర్లను అందజేశారు. ఆరు పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ యాదవ్, వెంకటస్వామి, మూర్తి, సూరీ, రామాంజి, సాయికుమార్, మగ్బూల్, నబీరసూల్, హరీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీ అధినేత చంద్రబాబు నిరుపేద మహిళలను ఆదుకునేందుకు వారికి ప్రతినెలా రూ.1500 అందిస్తారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వారు శనివారం మండల పరిధిలోని శ్యాపురం, కంబాలపల్లి, బీదానిపల్లిల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు జీవీపీ నాయుడు, మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, నరసింహులు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, నరహరి, వీరాంజనేయులు, కొల్లప్ప, సర్పంచ్ మంజు, టైలర్ ఆంజనేయులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్(సోమందేపల్లి): టీడీపీ నాయకులు శనివారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమందేపల్లిలోని దుర్గానగర్, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, నీరుగంటి చంద్ర, నాగమణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ ఎంపీపీ కేశవయ్య పేర్కొన్నారు. టీడీపీ నాయకులు శనివారం మండలంలోని గోనిపేటలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు.

బీసీలకు భరోసా ఇచ్చిన టీడీపీ

రొళ్ల, ఏప్రిల్ 13: బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంతోపాటు వారి అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎంతగానో కృషి చేసిందని టీడీపీ రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప పేర్కొన్నారు. మండలంలోని దొడ్డేరి, గుడ్డగుర్కి గ్రామాల్లో శనివారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు తిరిగి ప్రాధాన్యత దక్కుతుందన్నారు. టీడీపీ బీసీ కోఆర్డినేటర్ రామన్న, నాయకులు రియాజ్, కృష్ణారెడ్డి, రవికుమార్, పాండురంగప్ప, శివన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారాన్ని విజయవంతం చేయండి

అగళి, ఏప్రిల్ 13 : అగళి మండలంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ లోకేష్ జిల్లా ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్ తెలిపారు. కోడిపల్లి, రామనపల్లి, నరసాంబుది, అల్లికెర పంచాయతీల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ హాజరవుతారన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

రొళ్ల: మండలంలోని ఎంరాయాపురం, ఎంఆర్‌గొల్లహట్టి, సోమఘట్ట, హలికుంట తదితర గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేసుధాకర్ తరఫున సీడబ్ల్యూసీ మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ గౌడప్ప, మల్లప్ప, రొళ్ల గొల్లహట్టి శీనప్ప, మైనారిటీ అధ్యక్షుడు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో నర్సుల నిర్లక్ష్యం

ఒకటిన్నర గంట వేచిన ఉన్నా వృద్ధురాలికి అందని వైద్యం


వైద్యం అందక వృద్ధురాలిని తీసుకెళ్లిపోతున్న బంధువు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 13: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంపురం ప్రభుత్వాసుపత్రి తరువాత హిందూపురం ప్రభుత్వాసుపత్రి అంత పెద్దది. అయితే ఇక్కడి వైద్యులు, సిబ్బందిలో ఉన్నంత నిర్లక్ష్యం మరి ఏ ఇతర ప్రభుత్వాసుపత్రిలో ఉండదని ఆసుపత్రికి వివిధ వ్యాధులతో వచ్చే రోగులు, వారి బంధువులు మాట్లాడుకోవడం విశేషం. సరైన అధికారి లేకపోవడం, నర్సులను, సిబ్బందిని నియంత్రించక పోవడంతో నిర్లక్ష్యం రాజ్యమేలుతుందని విమర్శిస్తు న్నారు.. ముఖ్యంగా వైద్యులు కూడా సమయపాలన పాటించకపోవడంతో యథా రాజా తథా ప్రజా అన్న చందంగా దిగువ స్థాయి సిబ్బందికి భయం లేకుండా పోయిందని అంటున్నారు. ఆసుపత్రిలో శనివారం జరిగిన నిర్లక్ష ఘటనే ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. మండల పరిధిలోని కిరికెరకు చెందిన 70 సంవత్సరాల వృద్ధురాలు నంజమ్మ తీవ్ర జ్వరం, తల భారంతో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఓపీ చీటి తీసుకొని 14వ నెంబర్ గదిలో వైద్యులకు చూపించారు. ఆమె తీవ్ర నీరసంగా ఉండటంతో సంబంధిత వైద్యులు రక్త పరీక్షలకు రాసి ఇచ్చి, మహిళా విభాగంలో(ఫీమేల్ వార్డులో) అడ్మిట్ కావాలని సూచించారు. వృద్ధు రాలు బంధువుల సహకారంతో రక్త పరీక్షలు చేయించి వార్డుకు వెళ్లారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే వార్డులో డ్యూటీలో ఉన్న నర్సులు నిర్లక్ష్యం ప్రద ర్శించారు. ఒకటిన్నర గంట సేపు వేచి ఉన్నా కనికరంచూపలేదని వృద్ధురాలి బంధువులు ఆరోపించారు. చివరకు గొడవ పడితే.... ఆసుపత్రికి వచ్చే రోగులు మీరొక్కరే కాదు చాలా మంది వస్తుంటారు. ఇద్దరు, ముగ్గురు రోగులు వచ్చాక ఒకే సారి సెలైన్ బాటిల్ పెడతామని ఉదాసీనంగా వ్యవహరించారని రోగి నంజమ్మ, వారి తరఫున బంధువులు ఆవేదన చెందారు. చాలా నీరసంగా ఉందని పదే పదే విన్నవించుకున్న తరువాత నర్సులు సెక్యూరిటీని పిలిచి ఆమెకు సెలైన్ బాటిల్ పెట్టమని సూచించారని నంజమ్మ, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఇక్కడ ఉంటే తమకు సరైన వైద్యం అందదని గ్రహించిన ఆ వృద్ధురాలిని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జ్ సూపరిం టెండెంట్ డేవిడ్‌రాజ్‌ను వివరణ కోరగా... ఈ విషయం తనదాకా రాలేదని తెలి పారు. సాధారణంగా ఇలా జరుగదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ


సుహానా


రేవతి


సబిహాసుల్తానా


పల్లవి


అఖిలసౌర్య


భువనేశ్వరి


సాదియ

పెనుకొండ, ఏప్రిల్ 13 : ఇంటర్ మీడియట్ పరీక్షల్లో ప్రథమ, ద్వితియ సంవత్సరం పరీక్షల్లో ఈ యేడాది ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షలకు 259 మంది విద్యార్థులు హాజరుకాగా 112మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయసంవత్సరంలో 180మంది పరీక్షలకు హాజరుకాగా 124 ఉత్తీర్ణత సాధించారు. అందులో ఎంఎల్‌టీ విద్యార్థిని సుహానా 979మార్కులు సాధించింది. బైపీసీ విద్యార్థిని సబిహా సుల్తానా 970 మార్కులు, రేవతి 967, సీఎస్‌సీలో మోహన్‌క్రిష్ణ 940, తహసీనా 930, ఎంపీ హెచ్‌డబ్ల్యూలో పల్లవి 927 మార్కులు సాధించారు. హెచ్‌ఈసీలో సంతోష్ బాబు 838, సెరికల్చర్‌లో హేమంత్‌కుమార్ 835, సీఈసీలో స్వాతి 888 సా. దించినట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో పది మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ ఏఓ కేశవయ్య తెలిపారు. మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో అఖిలసౌర్య 472 మార్కులు సాధించగా, సాదియ 461మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో భువనేశ్వరి 971మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగాధర్, ఏఓ, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం

- ఎంపీ అభ్యర్థి చంద్రప్ప

పావగడ, ఏప్రిల్ 13: దేశంలో ఈ నెల 26 నుంచి జరిగే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసి దేశాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లడమే కాంగ్రెస్ పార్టీ ప్రముఖ ధ్యేయమని కాంగ్రెస్ చిత్రదుర్గం ఎంపీ అభ్యర్థి చంద్రప్ప తెలియజేశారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడా రు.

'జేడీఎస్ నాయకుల రాజకీయ వ్యాపారం'

పావగడ తాలూకా వ్యాప్తంగా జేడీఎస్ పార్టీ నాయకు లందరూ ఎన్నికల సమయంలో రాజకీయ వ్యాపారం చేస్తున్నారని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ దుయ్యబట్టారు. ఆయన పావగడలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆంజనేయులు, వెంకటరమణప్ప, శిరా ఎమ్మెల్యే జయచంద్ర, మానం వెంకటస్వామి, శంకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.